సాక్షి
జనగామ

బుధవారం | 18 | జనవరి | 2023



మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ

ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి. - 8లో▸



బీఆర్ఎస్ సభ చరిత్రలో నిలిచిపోవాలి

ఖమ్మంలో బుధవారం (నేడు) నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/17^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అధిక ధర కల్పించేందుకు కృషి

పాలకుర్తి టౌన్: రైతులు పండించిన మిర్చిని దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వం కల్పించిన అధిక ధరకు విక్రయించేందుకు మార్కెట్‌లో తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ ఏపీడీ నూరొద్దీన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మండలంలో 340 మంది రైతులకు 585 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారని, మొత్తం 8 వేల క్వింటాళ్ల మిర్చి దిగుబడి అవుతుందని స్పష్టం చేశారు. మండలంలో వావిలాల, మంచుప్పుల, ముత్తారం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, ఏఓ వరలక్ష్మి, ఏఈఓ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి



జనగామ రూరల్: జిల్లా పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను వెంటనే క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రాజారెడ్డి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదనపు పని భారంతో ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. యూనిఫాంలు, టీఏ డీఏలు ఇవ్వాలని డిమాండ్ చే శారు. బదిలీలు పెట్టుకున్న వారికి తక్షణమే స్థానచలనం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కవిత, ఉజ్వల, మౌనిక, రజిత, విజయ, భవాని, కళ్యాణి, హైమావతి, సునీత, స్వప్న, హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్



జనగామ: జనగామ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గోపాల్‌రావు మంగళవారం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజుతో కలిసి కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. మెడికల్ కళాశాల కోసం తాత్కాలిక భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

సైన్స్ సెమినార్‌లో పాల్గొనాలి

జనగామ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, పరిశోధకులకు ఒకరోజు సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి గౌసియా బేగం తెలిపారు. ఫిబ్రవరి 28న 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. జిల్లాలో మోడల్, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులను సిద్ధం చేయాలని కోరారు. ఫిబ్రవరి 2వ తేదీలోగా ఫార్మాట్‌లో మెయిల్ పంపాలన్నారు. కాగా రేపు టీ శాట్‌లో ఉదయం 11 నుంచి 1 గంట వరకు 'సెమినార్ పేపర్ ఎలా సిద్ధం చేయాలి, ఎలా సమర్పించాలి' అనే అంశంపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడిలో జాప్యం

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి
టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్

నిట్‌లో ముగిసిన సివిల్ వర్క్‌షాప్

దేవాలయ భూమిని కాపాడాలి

- 10లో▸

అటకెక్కిన స్థానిక ఉపపోరు

గతేడాది పూర్తయిన ఎన్నికల ఏర్పాట్లు

- సర్పంచ్ స్థానంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు బాధ్యతలు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- జిల్లాలో 37 జీపీల్లో ఎన్నికలు
- ప్రభుత్వానికి తుది ఓటరు జాబితా





ఉప ఎన్నికలు	
జరగాల్సిన జీపీలు	: 37
సర్పంచ్‌లు	: 10
వార్డు సభ్యులు	: 44
ఎంపీటీసీలు	: 2
పోలింగ్ కేంద్రాలు	: 83
ఓటర్లు	: 16,923

జనగామ: స్థానిక సంస్థల ఉప ఎన్నికల పోరు అటకెక్కింది. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు ఖాళీ అయిన స్థానాల్లో నేటికి ఇన్‌చార్జ్‌ల పాలనే కొనసాగిస్తున్నారు. పదవులకు రాజీనామా చేయడంతో పాటు కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులు చనిపోయారు. గతేడాది జరగాల్సిన మినీపోరు వాయిదా పడుతూ వస్తుంది. సర్కారు ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మినీ పోరుకు జాప్యం జరుగుతుండటంతో బరిలో నిలిచే అభ్యర్థులు నిరాశకు లోనవుతున్నారు.

జిల్లాలోని 281 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో 10 సర్పంచ్, 44 వార్డులు, 2 ఎంపీటీసీల స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 2019 జనవరి 21వ తేదీన సర్పంచ్ ఎన్నికలు జరుగగా, అదే రోజు సాయంత్రం ఫలితాలను వెల్లడించారు. ఫిబ్రవరి 2వ తేదీ సర్పంచ్‌లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్‌గా కొనసాగుతూనే వ్యక్తిగత కారణాల చేత రాజీనామా చేయగా, మరికొన్ని చోట్ల మృతి చెందారు. కాగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామపంచాయతీలో రిజర్వేషన్ వివాదంతో ఎన్నికలు జరగలేదు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమే..

జిల్లాలో 37 గ్రామ పంచాయతీల పరిధిలో మినీ పోరు జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించి 16,923 ఓటర్లు, 83 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి తుది నివేదిక సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించారు. ఇందులో మహిళా ఓటర్లు 7,497 పురుష ఓటర్లు 8,426 మంది ఉన్నారు.

ఎన్నికలు ఎక్కడంటే...

జిల్లాలో 10 స్థానాల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్‌ల ఎన్నిక కోసం ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో శివునిపల్లిలో రిజర్వేషన్ గొడవతో అసలే ఎన్నికలు జరగలేదు. దేవరుప్పుల మండలం సీతారాంపురం, పాలకుర్తి మండలం రాఘవాపూర్, రఘునాథపల్లి మండలం కోడూరు, బచ్చన్నపేట మండలం లక్ష్మాపురం, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి, జనగామ మండలం గోపిరాజుపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం, దేవరుప్పుల మండలం రాంబోజీ గూడెం, దుబ్బతండా, జనగామ మండలం శామీర్‌పేట సర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. సర్పంచ్, వార్డు సభ్యులు ఖాళీ అయి ఏళ్లు గడిచిపోతున్నా..ఉప ఎన్నికలకు మోక్షం కలగడం లేదు.

పోటీకి సై అంటున్న పార్టీలు

స్థానిక సంస్థల ఉప పోరుకు అధికార బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు స్వతంత్రులు సై అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో.. ఉప ఎన్నికలు నిర్వహిస్తే... పోటీ రసవత్తరంగ సాగే అవకాశం ఉంటుంది. గత ఏడాది ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం నేపథ్యంలో బరిలో నిలిచే అభ్యర్థులు నిధులను సైతం సమకూర్చుకున్నారు. దీంతో గ్రామాల్లో కొన్ని నెలల పాటు సందడిగా మారింది. మినీపోరు ఆలస్యం అవుతుండడంతో... గ్రామాల్లో సైతం స్తబ్దత నెలకొంది. ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు చెక్ పవర్ ఇచ్చి పాలన నెట్టుకు వస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం మరో ఏడాది మిగిలి ఉండడంతో... ఒక వేళ ఎన్నికలు వస్తే... అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారనుందని చెప్పుకోవచ్చు.

సర్కారుకు తుది ఓటరు జాబితా



జిల్లాలో స్థానిక సంస్థల్లో జరగాల్సిన ఉప ఎన్నికలకు సంబంధించి గత ఏడాది తుది ఓటరు జాబితాను ప్రభుత్వానికి పంపించాం. 37 జీపీల్లో ఉప పోరు జరగాల్సి ఉండగా, 10 చోట్ల సర్పంచ్, 44 వార్డులు, 2 ఎంపీటీసీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించి 16,923 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల కోసం 83 పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి.

- వసంత, ఇన్‌చార్జ్ డీపీఓ

సెల్‌ఫోన్ మోజుతో ఆటలకు దూరం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



విజేత టీంతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ: సెల్‌ఫోన్ మోజుతో నేటి తరం యువత, పిల్లలు ఆటలకు దూరమవుతున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రెస్టన్ మైదానంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గత 20 రోజులుగా జనగామ ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. మంగళవారం ఫైనల్ పోరులో జనగామ ప్రీమియర్ లీట్-2, లింగాల ఘనపురం (నెల్లుట్ల) యాకూబ్-11 టీం తలపడ్డాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, లింగాలఘనపురం ఎంపీపీ చిట్ల జయశ్రీ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి, కెకె ఆస్పత్రి చైర్మన్, డాక్టర్ సుల్తాన్‌రాజ, కౌన్సిలర్ వాంకుడోతు అనిత, మారబోయిన పాండు, మల్లవపరు అరవింద్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, విష్ణు వర్ధన్‌రెడ్డి, ప్రెస్టన్ కరస్పాండెంట్ బక్క ప్రవీణ్ తదితరులతో కలిసి క్రికెట్ ఫైనల్ పోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు ఆడే విధంగా ప్రోత్సహించాలన్నారు.

లింగాలఘనపురం టీం విజయం

ఫైనల్ పోరులో లింగాలఘనపురం టీం.. జేపీఎల్-2 టీంపై 11 పరుగుల తే డాతో విజయం సాధించారు. లింగాలఘనపురం 15 ఓవర్లలో 80 పరుగుల చేసి ఆలౌట్ అయింది. జేపీఎల్-2 టీం నిర్ణీత 15 ఓవర్లలో 69 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి నగదు బహుమతి రూ.30వేలు, కప్, రెండో నగదు బహుమతి రూ.15వేలు, కప్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కేసీఆర్

తెలంగాణలో అభివృద్ధి సాధ్యం కాదని ప్రగల్భాలు పలికిన వారి నోరు మూ యించే విధంగా కేసీఆర్ సీఎంగా అధికారంలోకి వచ్చిన తర్వాత సుసాధ్యం చేసి, రాష్ట్రం వైపు ప్రపంచమే చూసే విధంగా తీర్చి దిద్దుతున్నాడని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఖమ్మం సభ నేపథ్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఖమ్మం సభకు నియోజకవర్గం నుంచి 100 వాహనాల్లో 15 వేల మంది తరలి వెళ్లనున్నారన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ మారబోయిన పాండు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ అధికారుల విస్తృత తనిఖీ

జనగామ: నిషేధిత ప్లాస్టిక్ వినియోగంతో పాటు పట్టణంలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జనగామ మున్సిపల్ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు ఆధ్వర్యంలో ఆయా డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ వినియోగం, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై వ్యాపారులకు జరిమానా విధించారు. అనంతరం ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి



మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

జఫర్‌గఢ్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత, దొరల పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్యవైశ్య భవనంలో పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జంగా రాఘవరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరా, పీసీసీ సభ్యులు గంగారపు అమృతరావు హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతూ సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, ఎంపీటీసీ సభ్యురాలు మాధరపు రజిత యాకయ్య, నాయకులు సోమనారాయణ, తాటికాయల రాజేందర్, రడపాక డానియల్, మామిడి శ్రీనయ్య, మేర్గు ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం
- 26 టీంలు, 5.99 లక్షల మందికి చికిత్సలు
- సెంటర్లలో ట్రయల్‌రన్ పూర్తి



ట్రయల్ రన్‌లో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జనగామ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రెండో విడతలో ప్రారం భించనున్న కంటి వెలుగు కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ సర్వం సిద్ధం చేసింది. నేడు ఖమ్మం సభలో సీఎం చేతుల మీదుగా కంటి వెలుగుల కార్యక్రమం ప్రారంభించిన తర్వాత ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కంటి పరీక్షలు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం కంటి పరీక్షలు చేసే శిబిరాల వద్ద వైద్య సిబ్బంది ట్రయల్‌రన్ నిర్వహించారు. కలెక్టర్ శివలింగయ్య పర్యవేక్షణలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.మహేందర్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇతర శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రోగ్రాంను విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లనున్నారు.

జిల్లాలోని 281 గ్రామపంచాయతీలతో పాటు జనగామ మున్సిపల్‌లో 30 వార్డులు ఉన్నాయి. మొదటి రోజు 24 శిబిరాలు, 2 అర్బన్‌లో నిర్వహించనున్నారు. 12 మండలాల పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం.. ప్రస్తుత లెక్కల ఆధారంగా 5,99,190 మంది జనాభా ఉన్నారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేశారు. ఇందుకు సంబంధించిన 26 కంటి పరీక్ష కేంద్రాలు, వైద్య బృంధాలు, ఒక్కో విభాగంలో 26 మంది ఆప్తాల్మిక్ డాక్టర్లు, వైద్య బృందంచే డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఒక్కో టీంలో ముగ్గురు ఏఎన్ఎం, 3 ఆశలు, సూపర్ వైజర్ ఉంటారు. కంటి పరీక్ష కోసం 26 ఏఆర్ యంత్రాలతో పాటు 26వేల కిట్లు జిల్లాకు చేరుకున్నాయి.

మొదటి రోజు కంటి వైద్య శిబిరాలు	
పీహెచ్‌సీ	కంటి పరీక్షలు
జనగామ	వార్డులు-1, 5
జనగామ రూరల్	ఓబుల్‌కేశ్వాపూర్
బచ్చన్నపేట	బచ్చన్నపేట, ఆలీంపూర్
స్టేషన్‌ఘన్‌పూర్	స్టేషన్‌ఘన్‌పూర్, తాటికొండ,ఇప్పగూడెం
లింగాలఘనపురం	లింగాలఘనపురం, నెల్లుట్ల
జఫర్‌గఢ్	జఫర్‌గఢ్, కూనూరు
దేవరుప్పల	దేవరుప్పల, ధర్మాపురం
తరిగొప్పల	తరిగొప్పల
నర్మెట	నర్మెట
రఘునాథపల్లి	రఘునాథపల్లి, కంచనపెల్లి, కోమళ్ల
చిల్పూరు	శ్రీపతిపల్లి, పాలకుర్తి
పాలకుర్తి	పాలకుర్తి, గూడూరు
కొడకండ్ల	కొడకండ్ల, రామవరం

పరీక్షలకు సిద్ధం



సీఎం కంటి వెలుగు ప్రోగ్రాంను ప్రారంభించిన తర్వాత ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు జనగామ జిల్లాలో వైద్య పరీక్షలు మొదలవుతాయి. జిల్లాలో ప్రతి రోజు 26 చోట్ల కంటి పరీక్షలు చేస్తాం. 5.99 లక్ష మందికి కంటి పరీక్షలు చేసేలా పక్కా ప్రణాళిక రూపొందించాం. కలెక్టర్ శివలింగయ్య ఆదేశాలను అనుసరించి ముందుకు వెళ్తాం.

- డాక్టర్ ఏ.మహేందర్, డీఎంహెచ్ఓ


రిక్షా కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జనగామ రూరల్: రిక్షా, సామిల్ కార్మికుల ఇళ్ల స్థలాలు వెంటనే అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ పట్టణంలోని బాణాపురం రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మూడు ఎకరాల స్థలం కార్మికులకు కేటాయించారని, వారికి తక్షణమే స్థలం చూపించాలన్నారు. రైల్వే ట్రాక్ పక్కనున్న భూమిని కొంతమంది కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జోగు ప్రకాశ్, బొట్ల శ్రీను, విజేందర్, చందు, లలిత, మల్లేష్ కళ్యాణం లింగం, సాయి, ప్రకాష్, మునీర్, శ్రీను, ముత్తయ్య, నరసయ్య, బాల్నె వెంటయ్య మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సోమశేఖర్



విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండ జిల్లాకు చెందిన కె.సోమశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలే రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల్లో ఈ మేరకు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న సోమశేఖర్ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సోమశేఖర్ ధర్మసాగర్ మండలం మల్లక్‌పెల్లి ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: రేపు (గురువారం) నిర్వహించే ప్రైవేట్ సెక్టార్‌లో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీమ్ లీజ్ కంపనీ ఆధ్వర్యంలో పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో 19న కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు సీనియర్ అసిస్టెంట్ గీత (7995430401) నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ పది మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

నేటి డిగ్రీ పరీక్షలు వాయిదా

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నిర్వహించాల్సిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల పరీక్షలు వాయిదా వేశామని, మిగితా పరీక్షలు యథావిధిగా టైంటేబుల్ ప్రకారమే నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాయిదా పడిన మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాలుగు డీఏలు విడుదల చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి



మాట్లాడుతున్న నన్నబోయిన తిరుపతి

విద్యారణ్యపురి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒకవైపు ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పుకుంటూనే.. బంగారు తెలంగాణ, దేశంలోనే నంబర్ వన్ ప్రభుత్వం అని చెప్పుకుంటూ.. మరోవైపు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టబోతుండటాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు, డిప్యూటీ డీఈఓ, డీఈఓ, డైట్ లెక్చరర్ల పోస్టులను కూడా పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రావుల రమేశ్, జిల్లా అధ్యక్షుడు ఎం.రఘుపతి, జనరల్ సెక్రటరీ గొడిశాల సత్యనారాయణ, జిల్లా బాధ్యులు అంకం శ్రీనివాస్, గొడిశాల రమేశ్, ముకుందరెడ్డి, లక్ష్మయ్య, రాజేంద్రం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జనగామ రూరల్: షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి కొర్నెలీఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఫౌండేషన్‌లో భాగంగా 100 మందికి గ్రూప్ 2, 3, 4 పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు నాన్ రెసిడెన్షియల్ కోచింగ్ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. జిల్లా అర్హులైన వారు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని యువతి మృతి


ప్రగతి (ఫైల్)

కాశిబుగ్గ: రైలు ఢీకొని యువతి మృతి చెందిన సంఘటన వరంగల్, చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధనసరికి చెందిన చాగంటి ప్రగతి(18) తల్లిదండ్రులు చిన్నతనం లోనే చనిపోయారు. వరంగల్ అబ్బనికుంటలోని తన పిన్ని వద్ద ఉంటూ ఎల్‌బీ కళాశాల లో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. చిన్న తనం నుంచి పోలీస్ కావాలనే ఆశయంతో ఎన్‌సీసీలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 12న ఎన్‌సీసీ క్యాంపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి నర్సంపేటలోని స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. తిరిగి 16వ తేదీ సాయంత్రం నర్సంపేట నుంచి బస్సులో వరంగల్‌కు చేరుకుంది. పట్టాల వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో చింతల్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వరంగల్‌కు వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో ప్రగతి అక్కడికక్కడే మృతి చెందింది. ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగళవారం మృతురాలి పిన్నికి అప్పగించారు. ప్రగతి మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో విచారణ జరుపుతున్నట్లు జీఆర్పీ సీఐ తెలిపారు.

మూడో రైల్వేలైన్ సర్వేకు అధికారుల రాక


హెలికాప్టర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలో గల విజయవాడ–మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ వరకు మూడో రైల్వేలైన్ ట్రాక్‌కు సంబంధించిన జీపీఎస్ ఏరియల్ సర్వే కోసం ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం హెలికాప్టర్‌లో కాజీపేట సేయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. విజయవాడ నుంచి సర్వే చేసుకుంటూ బయలుదేరిన హెలికాప్టర్‌లో ఇంధనం అయిపోరావడం, సాయంత్రం కావడంతో ఎయిర్‌లైన్స్ అధికారుల ఆదేశానుసారం కాజీపేటలో ల్యాండింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. కాజీపేటలో రాత్రి బస చేసి ఏరియల్ సర్వే నిమిత్తం బుధవారం హెలికాప్టర్‌లో వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెలికాప్టర్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కాజీపేట సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

పవిత్ర జలంతో మహా సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు



స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న కూనూరు పూజారులు



మల్లన్నను దర్శించుకుంటున్న ట్రిబ్యునల్ జడ్జి సత్యేంద్ర



మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ

- శ్వేత లింగానికి అభిషేకం, అన్నపూజ
- కూనూరు ఉమామహేశ్వర ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం మంగళవారం పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఉదయమే ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో గర్భాలయాన్ని శుద్ధి చేయగా ఒగ్గు పూజారులు స్వామివారిని మేలు కొలిపారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు అలంకరించారు. అర్చకులు స్వామివారి బండారి(పసుపు) నీటిలో కలిపి మామిడి ఆకును కలశంలో ఉంచి మేళతాళాల నడుమ వేద మంత్రోచ్ఛరణలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తిరుగుతూ భ్రమరాంభిక, ఎల్లమ్మ ఆలయాలతో పాటు అన్ని కార్యాలయాలను పవిత్ర జలంతో శుద్ధిచేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం లింగాకారుడిని అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. దీంతో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర, బ్రహ్మోత్సవాల్లో మకర సంక్రాంతి నాలుగు రోజుల జాతర తొలి ఘట్టం ముగిసినట్లయింది. రానున్న రోజుల్లో భ్రమరాంభిక ఆలయ వార్షికోత్సవ వేడుకలు, శివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివరాత్రి రోజు పెద్దపట్నం, భ్రమరాంభిక అమ్మవారితో శివ కల్యాణం, ఉగాది ముందు వచ్చే ఆదివారం మరోసారి పెద్దపట్నం, బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మలతో ప్రత్యేకంగా మల్లన్న కల్యాణం జరపనున్నారు. నాలుగు రోజుల ఉత్సవాల్లో సుమారు 8లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా వేస్తున్నామని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాల్లో స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటారని, మరో ఐదు లక్షల మంది స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

పట్టువస్త్రాల సమర్పణ

లక్షలాది మంది జాతరలో పాల్గొనగా పూజలందుకున్న మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మ, భ్రమరాంభిక అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం కూనూరు ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి అర్చకులు మధుశర్మ, సదాశివశర్మ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు మధుశర్మ, భానుప్రసాద్, నరేష్‌శర్మ, శ్రీనివాస్, కూనూరు సర్పంచ్ ఇల్లందుల కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న జిల్లా ట్రిబ్యునల్ జడ్జి

ఐలోని మల్లన్నను హనుమకొండ జిల్లా ట్రిబ్యునల్ జడ్జి వై.సత్యేంద్ర దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జడ్జి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలతో సత్కరించారు.


లింగాకారుడిని అన్నంతో అలంకరించిన దృశ్యం

తండ్రిపై పెంపుడు కుమారుడి దాడి

వర్ధన్నపేట: తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా పెంచుకున్న పిల్లవాడే తండ్రిపై కత్తిపీటతో దాడి చేసిన ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిరిపాటి వెంకటేశ్–యాకమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట యాకమ్మ సోదరి, మరిది మృతి చెందారు. దీంతో వారి కుమారుడైన నితిన్‌ను వెంకటేశ్–యాకమ్మ దంపతులు సొంత కొడుకు వలే పెంచుకున్నారు. కాగా, నితిన్ మద్యానికి బానిసై ఇష్టారీతిగా ప్రవర్తిస్తున్నాడు. సోమవారం బాగా మద్యం తాగి రావడంతో వెంకటేష్ మందలించాడు. దీంతో కోపోద్రిక్తుడై నితిన్ కత్తిపీటతో అతడిపై దాడి చేయడంతో తొడ, చేతి మణికట్టుపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మంగళవారం యాకమ్మ ఫిర్యాదు చేయడంతో నితిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువతి మృతి

ఎస్‌ఎస్ తాడ్వాయి: ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో యువతి మృతి చెందగా, యువకుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాలలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. లింగాల గ్రామానికి చెందిన కొమురం ప్రభాస్, గంగారం మండలం దుబ్బగూడెంకు చెందిన సువర్ణపాక యమున(18) ప్రేమించుకుంటున్నారు. యమున లింగాల గ్రామంలోని తన సమీప బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ ఏం జరిగిందోగాని ప్రేమికులిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా యమున మృతి చెందింది. ప్రభాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్ సభ చరిత్రలో నిలిచిపోవాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మరిపెడ: ఖమ్మంలో బుధవారం(నేడు) నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయేలా జన సమీకరణ చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ నాయకులకు సూచించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని నవీన్‌రావు అతిథి గృహంలో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, ఎంపీ మాలోత్ కవితతో కలిసి జనసమీకరణపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను సభకు తరలించేలా నాయకులు జనసమీకరణ చేయాలన్నారు. కార్యకర్తలను తరలించే వాహనాల్లోనే లీడర్లు సభకు రావాలని సూచించారు. పార్టీ కోసం పాటుపడే నాయకులు, ప్రజాప్రతినిధుల గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఫిబ్రవరిలో ప్రతి నియోజకవర్గానికి 2 నుంచి 3 వేల ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మండల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, జనగామ జిల్లా గ్రంథాలయ చైర్మన్ యడవెల్లి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అచ్చుత్‌రావు, మహేందర్‌రెడ్డి, గడ్డం వెంకన్న, మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వర్‌రావు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూతకు ఎదురుచూపులు

ట్రస్ట్ చేతిలో మోసపోయిన వైద్య విద్యార్థి

- ఫీజు కట్టేందుకు ఆర్థికసాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

కాజీపేట: ఓ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెప్పిన మాటలు నమ్మి వైద్య విద్య కోసం రష్యాకు వెళ్లిన విద్యార్థి ఆ ట్రస్టు చేతులు ఎత్తేయడంతో చదువు కొనసాగించలేక, తిరిగి రాలేక మనసున్న మహారాజుల సాయం కోసం అభ్యర్థిస్తున్నాడు. కాజీపేటకు చెందిన మోరోజు వంశీకృష్ణ వైద్య విద్య అభ్యసించాలనుకున్నాడు. ఏడాది ఫీజు కడితే చాలు మిగతాది స్కాలర్‌షిప్ వస్తుంది.. వైద్య విద్య పూర్తవుతుందని పుట్ట కిశోర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెప్పిన మాటలు నమ్మి రష్యాలోని ఏసియన్ మెడికల్ కాలేజీలో చేరాడు. ఆరు నెలలు గడవక ముందే ట్రస్టు నిర్వాహకులు ముఖం చాటేయడంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి నాలుగో ఏడాది వరకు చదివించారు. ఇటీవల ఏసియన్ మెడికల్ కాలేజీ నిర్వాహకులు రూ.2లక్షలు కడితేనే ఫైనల్ ఎగ్జామ్స్ రాయనిస్తామని స్పష్టం చేశారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కనిపించిన వారినల్లా సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. వైద్య విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన వంశీకృష్ణ సర్టిఫికెట్లను పట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడా సరైనా భరోసా రాకపోవడంతో కన్నీరు పెడుతున్నారు. వంశీకి దాతలు సాయం చేస్తే ఫైనల్ ఇయర్ పూర్తిచేసే అవకాశం ఉందని వేడుకుంటున్నారు.

ఆర్థికసాయం చేయాలనుకునే వారు 91776 38463 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్ పే చేయగలరు.

తైక్వాండో పోటీల్లో పేద విద్యార్థిని ప్రతిభ..

- యూపీలో జాతీయస్థాయి పోటీలు
- పాల్గొనేందుకు ఆర్థికసాయం కోరుతున్న అంకిత


తైక్వాండోలో గోల్డ్‌మెడల్ సాధించిన అంకిత

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన గొడిశాల అంకిత(ఇంటర్ విద్యార్థిని) రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు యూపీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు దాతలు ఆర్థిక సాయం చేయాలని కోరుతోంది. గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన గొడిశాల ప్రభాకర్ – సైదమ్మ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. రెండో కుమార్తె అంకిత 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కేసముద్రం మండలం ఇనుగుర్తిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివింది. ప్రస్తుతం మానుకోటలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఎంపీసీ చదువుతుంది. 8వ తరగతి నుంచి తైక్వాండోలో రాణిస్తున్న అంకితకు మానుకోటకు చెందిన కోచ్ రమేష్ శిక్షణ ఇస్తున్నాడు. ఈక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించింది. గతేడాది డిసెంబర్‌లో వికారాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న అంకిత గోల్డ్‌మెడల్ సాధించి ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

పేదరికంలో కుటుంబం..

నిరుపేద కుటుంబానికి చెందిన గొడిశాల అంకిత యూపీలో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు వెళ్లాలంటే సుమారు రూ.40 వేల ఖర్చు అవుతుంది. తల్లిదండ్రులు కూలీలని, వారి వద్ద అంత పెద్ద మొత్తంలో డబ్బు లేదని అంకిత వాపోతుంది. దాతలు ఆర్థిక సాయం చేస్తే క్రీడల్లో పాల్గొని జిల్లాకు మంచిపేరు తీసుకువస్తానని వేడుకుంటోంది.

ఆర్థికసాయం చేయాలనుకునే వారు 97012 75451, 99495 12440 నంబర్లకు గూగుల్‌పే, ఫోన్‌పే చేయగలరు.

ఈఓ వద్దకు పూజారుల వాటా పంచాయితీ


ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పూజారి లక్ష్మణ్‌రావు


గద్దెకు తాళాలు వేసేందుకు ప్రయత్నిస్తున్న పూజారి కుటుంబ సభ్యులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: సమ్మక్క పూజారి వాటా పంచాయితీ ఈఓ రాజేంద్రం వద్దకు చేరింది. తాను చేయాల్సిన డ్యూటీ చేల వంశానికి చెందిన వారు చేస్తూ తనను గద్దెపైకి రానివ్వడం లేదని సమ్మక్క పూజారి లక్ష్మణ్‌రావు మంగళవారం ఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఈఓ గద్దెలపై డ్యూటీ చేస్తున్న చేల రామారావును పిలిపించి మాట్లాడగా తమ వంశీయులు కూడా వాటా హక్కుదారులని, దానికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని తెలిపారు. గత జాతరకు సంబంధించి తమకు రావాల్సిన వాటా మొత్తం ఇంకా చెల్లించకపోవడంతో ఆయనకు బదులుగా తాము పూజలు నిర్వహిస్తున్నామని ఈఓకు వివరించారు. దీంతో వాటాల విషయాన్ని ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈఓ సూచించారు. ఈ క్రమంలో సమ్మక్క పూజారి లక్ష్మణ్‌రావు చేల వంశీయులను తన డ్యూటీలోకి రాకుండా చర్య తీసుకోవాలని ఈఓకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న చేల వంశీయులను పూజారి లక్ష్మణ్‌రావు పూజా కార్యక్రమాలు విరమించుకోవాలని కోరాడు. వారు విరమించుకోవడంతో సమ్మక్క గద్దెకు తాళాలు వేశాడు. వెంటనే ఈఓ స్పందించి సిబ్బందితో తాళాలు తీయించారు. వాటా విషయం ఉంటే పరిష్కరించుకోవాలనే గాని.. గద్దెలకు తాళాలు వేయవద్దని ఈఓ సూచించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు


గాయపడిన అభినవ్


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- ఎగిరి మరో కారుపై పడిన వైనం
- రాఘవాపూర్‌లో ఘటన
- నలుగురికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: నల్లగొండ నుంచి కాజీపేటకు వస్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో ఎగిరి వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న మరో కారుపై పడింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌లో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ మట్టెవాడకు చెందిన ఏవీవీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పత్రి లక్ష్మీనర్సింహప్రసాద్, ఆయన భార్య పత్రి నాగలక్ష్మీ, ఆమె కుమారుడు ప్రణీత్, డ్రైవర్ సొల్లేటి అజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వరంగల్ నుంచి కారులో సికింద్రాబాద్‌కు బయలుదేరారు. అలాగే, నల్గొండకు చెందిన పురుషోత్తమ్‌రావు కొన్నేళ్లుగా కాజీపేట ఫాతిమాలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన నల్గొండకు వెళ్లి కారులో కాజీపేటకు భార్య అమలాద్భవి రాణి, కుమారుడు వేదస్ అభినవ్‌తో కలిసి వస్తున్నారు. రాఘవాపూర్‌కు రాగానే పురుషోత్తమ్‌రావు కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి లక్ష్మీనర్సింహప్రసాద్ కారుపై పడింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ఉన్న పత్రి నాగలక్ష్మీ, బాలుడు వేదస్ అభినయ్‌కు తీవ్రగాయాలు కాగా, రాణి అజయ్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.


అంతర్రాష్ట్ర వంతెనపై సిమెంట్ తేలి బయటపడిన రాప్టర్లు


వంతెనపై ఏర్పడిన గుంతలు

'మహా' డేంజర్!

- వంతెనపై సిమెంట్ తేలి రాప్టర్లు బయటకు..
- పట్టించుకోని జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు

కాళేశ్వరం: జాతీయ రహదారే కదా అని ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే అంతే. తెలంగాణ – మహారాష్ట్రలను కలుపుతూ నిర్మించి అంతర్రాష్ట్ర వంతెనపై అక్కడకక్కడా సిమెంట్ తేలిపోయి ఇనుప రాప్టర్లు బయటపడ్డాయి. దీంతో రాప్టర్లు తేలిన గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. వాహనాలు చెడిపోతున్నాయి. ఒకవేళ అతి వేగంతో వచ్చి గుంతలో పడితే ఏకంగా వంతెన మీద నుంచి గోదావరిలో పడే అవకాశం లేకపోలేదు. ఇక కనీసం విద్యుత్ వెలుగులు కూడా లేని వంతెనపై రాత్రివేళలో ప్రయాణమంటే 'మహా' డేంజర్ అంటూ జనం జంకుతున్నారు. గుంతల వద్ద ఎర్ర బిర్రన్లు, బండరాళ్లు పెట్టారు. వాటితో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. భారీ ప్రమాదాలు జరగక ముందే ఇరు రాష్ట్రాల ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేయాలని తెలంగాణ – మహారాష్ట్ర ప్రజలు కోరుతున్నారు.

స్వాములపై దొంగతనం ఆరోపణ

- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- తులిస్యా తండాలో ప్రచారం సందర్భంగా ఘటన
- పుస్తెలతాడు దొరకడంతో కథ సుఖాంతం


దొంగతనం ఆరోపణలు ఎదుర్కొన్న స్వాములు

కురవి: మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన తుల్జా భవాని, సేవాలాల్ మహారాజ్ స్వాములు దైవ ప్రచారం కోసం మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రం శివారు తులిస్యాతండా జీపీకి వెళ్లారు. తండాలో ప్రచారం చేస్తుండగా బానోత్ రెడ్యానాయక్ భార్య తన కుమార్తె జాతకం చెప్పాలని వారిని కోరింది. దీంతో స్వాములు ఆమెతో మాట్లాడి పుస్తెలతాడు బయటకు తీయమని చెప్పారు. ఆ సమయంలో పుస్తెలతాడు మెడలో లేకపోవడంతో ఆమె లబోదిబోమంది. రెడ్యానాయక్ భార్య అరుపులు విన్న చుట్టుపక్కల జనం వచ్చి స్వాములపై దొంగతనం మోపి కురవి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పోలీసులు స్వాములను విచారించారు. అదే సమయంలో రెడ్యానాయక్ ఇంట్లోనే పుస్తెలతాడు ఉందని పోలీసులకు సమాచారం అందడంతో స్వాములు ఊపిరి పీల్చుకున్నారు. దొంగతనం ఆరోపణ మోపడంతో ఇబ్బంది పడ్డామని స్వాములు రాంరావు, అంకుస్, శివాజీ, సకరాలు ఆవేదనతో తెలిపారు.